*ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి*

ద్రావిడ విశ్వవిద్యాలయం 9440493604

# ఇదీ వచనకవితలో ఆధునికత

వచన కవితలో ఆధునికత అంటే ఇక్కడ వస్తురీత్యా ఆధునికతని గురించి మాట్లాడడంలేదు. దానికి మరొక సందర్భం ఉంది. వచన కవిత రచనలో నవ్యత గురించి ఇక్కడ చూద్దాం. వచన కవిత వచ్చిన కొత్తలో అది అటు గేయకవిత్వానికి పొడిగింపుగా ఉండేది. వచన కవిత పునాదులు శ్రీశ్రీ కాలానికే ఉన్న స్థితిని గురించి తిరిగి ఇక్కడ చెప్పుకోనవసరం లేదు. ఇది చర్విత చర్వణమే. మహా ప్రస్థానంలో వివిధ గతులలోని గేయాలను చూడవచ్చు. అలాగే వచన కవిత రాయడానికి చేసిన ప్రయత్నాలు కూడా చూడవచ్చు. పాద సంఖ్యానియమం పాటిస్తూ త్ర్యస్రగతి, చతురస్ర గతి ఖండగతిలో రాసిన గేయాలు అలాగే మిశ్రగతిలోని ముత్యాల సరాల గేయాలు మనకు శ్రీశ్రీ లో ఉన్నాయి. వాటితో పాటు వచన కవిత రాసే ప్రయత్నంలో పాదసంఖ్యా నియమం లేకుండా ఈ మాత్రాఛందస్సులతో పనిలేకుండా రాసిన వచన కవితా ప్రయత్నాల గురించి కూడా చర్చ జరిగింది. ఇక వచన కవిత వచ్చిన కొత్తలో రాసిన అలంకారాలు అభివ్యక్తులు చాలా ప్రాచీన కవితలోను ఇటు గేయకవితలోను ఉన్న ధోరణులుగా కనిపిస్తాయి. వచన కవిత గేయాన్ని విడిచి పెట్టినా ఆదిప్రాసలు గాని అంత్యప్రాసలు కాని వేసుకుంటూ రకరకాల విచిత్రమైన సంబోధనలు చేస్తూ రాసిన కవితలు తర్వాత వచ్చిన శుద్ధవచన కవితకు అటుగా ఉన్న గేయానికి మాధ్యమికంగా కనిపిస్తాయి. రూపం రీత్యా 80 వ దశకంలో వచన కవిత రాటు దేలింది, ఆధునికతని సంతరించుకోవడం జరిగింది. అటు స్త్రీవాద కవులు, దళిత కవులు  వస్తునవ్యతని తీవ్రస్థాయిలో తీసుకువస్తున్న కాలంలోనే నాటి యువకవులు ఖమ్మం త్రయం (అఫ్సర్, సీతారామ్, ప్రసేన్), దెంచనాల శ్రీనివాస్ తర్వాతి కాలంలో యాకూబ్ ఇంకా చాలామంది రూపరచనలో అభివ్యక్తిలో చాలా నవ్యతని తీసుకు వచ్చే ప్రయత్నంచేశారు. ఆనాటికే చేరా ఈవిషయాలను చాలా వివరంగా చర్చించారు.

గడచిన పది సంవత్సరాలలో వచన కవిత మరింత కొత్త పోకడలు పోయింది. తర్వాత ఇటీవల వచన కవిత అంతర్జాలంలోనికి ప్రవేశించింది చాలా జాలపత్రికలు (నెటన్ జర్నల్స్) జాల స్థలాలు (వెబ్ సైట్స్) వచన కవితని ఆదరించిన కారణాన వచన కవిత సరిహద్దులను చెరిపేసుకొని, ఎన్నో దేశాలనుండి వస్తూ, ఒక వర్చ్యువల్ ప్రపంచంలోనికి వెళ్ళింది. పత్రికలో రాయడానికి వెబ్ సైట్ లో రాయడానికి తేడా ఏమిటి అని ప్రశ్నవేయవచ్చు. వెబ్ లో ఉన్నంత మాత్రాన వచన కవితలో గుణాత్మక పరిణామం జరుగుతుందా అనే వాదన చేయడానికి అవకాశం ఉంది. అయితే వెబ్ లో ఉన్నంత మాత్రానే ఇది జరగదు. పుస్తకం అన్నది లిఖిత మాధ్యమానికి చెందుతుంది. అంటే కవిత లిఖిత రూపంలో స్థిరంగా మిగిలిపోతుంది. కాని వెబ్ అన్నది విద్యున్మాధ్యమంగా కొత్తగా స్థిరపడింది. అంటే విద్యున్మాధ్యమం అని ఎందుకనాలి అంటే ఈ కవితలు కాగితాల మీదికి రావు. ఇవి పుట్టడం, తర్వాత వాటి ఉనికి వాటిపైన చర్చలు అంతా నెట్ లోనే ఉంటుంది. క్వచిత్తుగా వీటిలో కొన్ని అచ్చయి లిఖిత మాధ్యమంలోనికి ప్రవహిస్తాయి. కాని ప్రాథమికంగా వీటి మాధ్యమం విద్యున్మాధ్యమమే. అంటే ఇక్కడ మాధ్యమ ప్రస్తావన కేవలం మాధ్యమం గురించి చెప్పడానికే కాదు. ఈ

మాధ్యమంలో కవులు రూపరచనలో చాలా నవ్యతని ఇటీవలి కాలంలో ప్రదర్శిస్తున్నారు. దీనికి ఫేస్ బుక్ చాలా మంచి వేదికగా మారింది. ఫేస్ బుక్ లో, కవిసంగమంలో మాత్రమే కాక ఇతరుల ముఖ(పుస్తక)వేదికలలో కూడా ప్రచురితం అయ్యాయి. చాలా ప్రాచుర్యం పొందాయి. ఒక వ్యక్తి తన ముఖ వేదికలో రెండు వేల మంది మిత్రుల లింక్ ఉంటే అతను తన వేదికలో కవిత ప్రచురించగానే ఈ రెండు వేల మంది వేదికలకి క్షణంలో ఈ కవిత చేరుతుంది. వాళ్ళు వాళ్ళమిత్రులకు దీన్ని షేర్ చేసుకునే అవకాశం ఉంది. అంతే కాదు. ఒకటి రెండు రోజుల్లోనే కొన్ని వందల స్పందనలు, వ్యాఖ్యలు దీనిపైన వస్తున్నాయి. ఇలా స్పందనలు చర్చలు ఒక కవితపైన రావడం లిఖిత సంప్రదాయంలో లిఖిత మాధ్యమంలో సాధ్యం కాదు. ఇది పుస్తక సమీక్షా సభల్లో కాని సెమినార్లలో మాత్రమే జరుగుతుంది. అదీ కవితా సంకలనం గురించి జరుగుతుంది కాని ఒక కవితపైన జరగడం ఉండదు. ముఖవేదిక లేదా అంతర్జాల మాధ్యమం సాధించిన కొత్త పరిణామం ఇదే. అందుకే ఈ తరహా అంతర్జాల సాహిత్యాన్ని నేను మూడో మాధ్యమం అని అంటున్నాను. అంటే ఇప్పటిదాకా మౌఖిక మాధ్యమం, లిఖిత మాధ్యమం ఉన్నాయి. ఇది ఎలక్ట్రానిక్ మాధ్యమం, మూడో మాధ్యమం. అయితే మారిన కొత్త మాధ్యమం వల్ల వచన కవితకు ఆధునికత వచ్చిందా. ఈతరహా ఆధునికత అటు లిఖిత సంప్రదాయంలో కూడా ఉండవచ్చు కదా. అలా రాయవచ్చు కదా అనే ప్రశ్నలు వస్తాయి. అవును అలా రాయవచ్చు. కాని ఇలా రాసే క్రమ పరిణామం ఈ మాధ్యమంలోనే నేడు ఉంది. ఇక్కడ మొదలైనదే తర్వాత పత్రికా మాధ్యమంలోనికి తర్వాత పుస్తకాలలోనికి వస్తూ ఉంది. సంప్రదాయికంగా లిఖిత మాధ్యమంలోనే ఉన్న కవులు నెట్ ప్రపంచం తెలియని వారు ఈ నవ్యతని ఇంకా అంది పుచ్చుకోలేదు. ప్రచురణ ప్రాచుర్యం కవితపైన వినూత్న చర్చ అనేవి కవితకు గుణాత్మక పరిణామాన్ని తెస్తాయి అనేది ఈ ఎలక్ట్రానిక్ మాధ్యమం ఋజువు చేసింది. ఇలా ఈ మాధ్యమంలో వ్యాప్తి పొందిన కవితలను కొన్నింటిని వాటి నవ్యతని విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నాను. ఈ తరహా వ్యాసం ఇప్పటికే ఒకటి (అన్వీక్ష) గురించి రాయడమైంది. ఇది మరొక ప్రయత్నం. ఇక్కడ ఒక కవిత ఇటీవలే క్రాంతి (మువ్వా) శ్రీనివాసరావు ముఖవేదికలో వచ్చినదాన్ని పరిశీలన చేద్దాం.

*క్రాంతి మువ్వా శ్రీనివాసరావు*

## సమాధానం

*సుప్రభాతగీతం మనకు మనమే పాడుకొని*
*పొద్దున్నే మళ్ళీ శవాన్ని భుజానవేసుకొని ......*
*నిన్నటి పాదముద్రలనే కాళ్ళకు తొడుక్కుంటాం*
*చెవులను అక్కడక్కడా అతికించి*
*నాలుగువైపులకు కళ్ళను పారేసుకొంటాం....*

*ఆపై కళ్ళను చెవులను ఏరి తెచ్చుకొని*
*ముందర పోగేసుకొని ఎడిటింగ్ లో విఫలమవుతుంటాం*

*విసిరేసిన ఆట వస్తువుల నడుమ .....పసిపిల్లాడిలా*

*చెల్లాచెదురైన ..దృశ్యాలు శబ్దాల మధ్య పడి అలసిపోతుంటాం*

*చలనపు చెలిమ ఎండిపోయేదాకా ....సమాధానాలకోసం వెతుకుతూనేవుంటాం .....*

ఈ కవితలో ఎక్కడా కిందటి తరం వారు రాసిన వచన కవిత ధోరణి  కనిపించదు. సగటు వ్యక్తి జీవితంలో ఏ కొత్తదనం లేక ఒకే విధంగా గానుగెద్దు జీవితం గడిపే, నిశ్శబ్దంగా సాగే ఆంతరంగిక హింస గురించి చిత్రిస్తుందీ కవిత. రెండో పాదం  ***'పొద్దున్నే మళ్ళీ శవాన్ని భుజాన వేసుకొని'*** అనే మాట పాఠకుడి మనస్సులో చప్పున విక్రమార్కుడి కథని గుర్తుకు తెస్తుంది. పట్టు వదలని విక్రమార్కుడు శవాన్ని లేదా ప్రేతాన్ని తిరిగి భుజాన వేసుకొని అనేది గుర్తుకు తెస్తుంది. గానుగెద్దు జీవితం ఎంత భారమో తెలుపుతుంది. దీనితర్వాత పాదాలు చూద్దాం.

*నిన్నటి పాదముద్రలనే కాళ్ళకు తొడుక్కుంటాం*

*చెవులను అక్కడక్కడా అతికించి*

*నాలుగువైపులకు కళ్ళను పారేసుకొంటాం....*

*ఆపై కళ్ళను చెవులను ఏరి తెచ్చుకొని*

ఈ నాలుగు పాదాలలోని అభివ్యక్తిని గమనిద్దాం. ***'పాదముద్రలను కాళ్ళకు తొడుక్కోవడం', 'చెవులను అక్కడక్కడా అతికించడం', 'నాలుగు వైపులా కళ్ళను పారేసుకోవడం', 'కళ్ళను చెవులను ఏరి తెచ్చుకోవడం'***, ఈ క్రియలన్నీ సంప్రదాయికంగా మనుషులు రోజూ చేసే క్రియలు కావు. కొత్తగా సృష్టించిన క్రియా కలాపాలు. ఇవి ఈనాటి సీనియర్ కవులు కొందరు రొటీన్ గా రాసే కవితల్లో ఉండే సిమిలీ (ఉపమా దాని వివిధ రూపాలు) మెటఫర్ (రూపకం దాని రూపాలు) వగైరాలలాంటి ఆలంకారిక అభివ్యక్తులు కావు. ఈ పాదాల్లో ఆ అలంకారాలు లేవు. పొడి వచనమే ఉంది. కాని కవి ఉద్దేశించిన భావాన్ని చాలా ప్రతిభావంతంగా చెప్పగలుగుతున్నాయి. రోజూ సాయంత్రం దాకా గడిపిన కాలంలో లేదా కొన్ని రోజులు గడిపిన కాలంలో రోజువారి అదే పద్ధతిలో చేసిన పనులు, నాలుగువైపులా విన్న నాలుగు మాటలు, నాలుగు వైపులా అప్రయత్నంగా, రేండమ్ గా చూసిన దృశ్యాలు, విన్న కబుర్లు ఇంటికి వచ్చిన తర్వాత నెమరు వేసుకోవడం అనే సగటు మనిషి వ్యధని అత్యంత ప్రతిభావంతంగా చెబుతున్నాయి. తర్వాత చూడండి.

*ఆపై కళ్ళను చెవులను ఏరి తెచ్చుకొని*

*ముందర పోగేసుకొని ఎడిటింగ్ లో విఫలమవుతుంటాం*

*విసిరేసిన ఆట వస్తువుల నడుమ .....పసిపిల్లాడిలా*

*చెల్లాచెదురైన ..దృశ్యాలు శబ్దాల మధ్య పడి అలసిపోతుంటాం*

*చలనపు చెలిమ ఎండిపోయేదాకా ....సమాధానాలకోసం వెతుకుతూనేవుంటాం .....*

'కళ్ళను చెవులను ఏరి తెచ్చుకొని' అని చెప్పడం అదే తరహా అతి నవ్యమైన అభివ్యక్తి. అంటే అప్పటిదాకా విన్నవాటిని చూచిన వాటిని నెమరు వేసుకొని చూచుకుంటాడు. ఇక్కడ మరొక అభివ్యక్తి 'ఎడిటింగ్ లో విఫలమవుతుంటాం'. తను విన్నవి చూచినవి ఏవి తనకు అవసరమో, వేటిని మరచి పోవాలో కూడా తెలుసుకోలేని దుస్థితిని ఇది చెబుతుంది. ఆ తర్వాత రెండు పాదాల్లో విసిరేసిన ఆటవస్తువుల నడుమ .. పసిపిల్లాడిలా అని చెప్పడం, మామూలుగా ఎక్కువమంది సీనియర్లు జూనియర్ కవులు మామూలుగా వేసిన ఉపమాలంకారం. తర్వాత చూడండి చలనపు చెలిమె అని రూపకంగా చెప్పడం కూడా అటువంటిదే. ఒక సగటు వ్యక్తి మోనోటనస్ జీవితం, వదిలించుకోలేని మరొక దానికి పోలేని జీవన యానం మార్చలేక, అలా సాగే దుర్భర స్థితిని అత్యంత ప్రతిభావంతంగా చాలా శక్తిమంతంగా వ్యక్తీకరిస్తుంది ఈ కవిత. దీనిలో అనుస్యూతంగా వచ్చే అలంకారాలు వాడి చెబితే ఇది జరిగేది కాదు. అతి నవ్యంగా వాక్యరచన అభివ్యక్తి చేయడం ద్వారానే ఇది సాధ్యం అయింది.

*నిన్నటి పాదముద్రలనే కాళ్ళకు తొడుక్కుంటాం*
*చెవులను అక్కడక్కడా అతికించి*
*నాలుగువైపులకు కళ్ళను పారేసుకొంటాం....*
*ఆపై కళ్ళను చెవులను ఏరి తెచ్చుకొని*

అయితే పైన చెప్పుకున్న కొత్త క్రియల్లో 'పాదముద్రలను కాళ్ళకు తొడుక్కోవడం', 'చెవులను అతికించడం' 'కళ్ళను పారేసుకోవడం' 'కళ్ళను చెవులను ఏరి తెచ్చుకోవడం' అనేవాటిని చూచినప్పుడు మనకు ఒక అసంబద్ధత కనిపిస్తుంది. కాని ఈ అసంబద్ధమైన క్రియలు అన్నీ ఒక సంబద్ధమైన చర్యను సూచిస్తున్నాయి. ఈ వాక్యలక్షణం మనకు సంప్రదాయ కావ్యాలలో అజహల్లక్షణ అనే అలంకారంలో ఉంటుంది. పది గొడుగులు వస్తున్నాయి. అని అంటే పది మంది గొడుగులు వేసుకొని వస్తున్నారని అర్థం. తుపాకులు మోహరించారు. అంటే తుపాకి ధారులైన సైనికులును లేదా పోలీసులను మోహరించారు అని అర్థం. జహత్ అంటే విడుచుచున్న అని అర్థం. అలాగే అజహత్ అంటే విడవకుండా అని తుపాకులు అంటే తుపాకులతో పాటు విడవకుండా వాటితో ఉన్న సైనికులు అని అర్థం వస్తుంది. ఇదే రీతిలో పాదముద్రలు తొడుక్కోవడం అంటే నిన్నటి పాదముద్రలలో అంటే నిన్న నడిచిన దారిలో అనే అర్థాన్ని తీయడం సాధ్యం అయింది. పాఠకుడికి ఈ అర్థం చప్పున చెప్పేలా ఉన్నాయి కవిత పాదాలు. ఇదీ నేటి వచన కవితలో ఆధునికత. ఇలాంటి వాక్య విన్యాసంతో రాస్తున్న యువకవులు నేడు అంతర్జాల సాహిత్యంలో బయటా ఇరవై మంది దాకా ఉన్నారు. ఈవిషయంలో అఫ్సర్ నేటి యువకవులకు అతని సీనియర్ తరానికి వారధిలాగా ఉన్నాడు. అతని కవితల్లో కూడా ఈ అభివ్యక్తి నవ్యత బాగా కనిపిస్తుంది. క్రాంతి (మువ్వా) శ్రీనివాసరావు వాక్య విన్యాసంలో ఈ సరికొత్త పోకడలు మరిన్ని చూపాడు. అసలు వచన కవిత భాషలోనే గుణాత్మక పరిణామం వచ్చింది. వాటిని మరొక వ్యాసంలో చర్చిద్దాం.

పులికొండ సుబ్బాచారి.